# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రివేళ స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. సుమారు 11వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.21,33,980 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.



సువర్ణ పుష్పార్చనలో పాల్గొన్న గాయకుడు ఎస్పీ చరణ్

### స్వామివారి సేవలో గాయకుడు ఎస్పీ చరణ్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ప్రముఖ గాయకుడు, ఎస్పీ బాలసుబ్రమణ్యం తనయుడు ఎస్పీ చరణ్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం యాదగిరికొండకు చేరుకున్న ఆయన స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణపుష్పార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన పేరిట సంకల్పం జరిపి, స్వామివారి హారతినిచ్చారు.



రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేసిన చలువ పందిళ్లు

# గుట్టలో నేటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

- 7న కల్యాణం, 9న రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 10 వరకు జరుగనున్న వేడుకలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అరటి, మామిడి తోరణాలు, చలువ పందిళ్లతో పాటు యాగశాల సిద్ధం చేశారు.

### స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్వస్తివాచనంతో ఉత్సవాలకు ప్రధానార్చకులు, పురోహితులు శ్రీకారం చుట్టనున్నారు. 6వ తేదీ ఉదయం ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 7న రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, 8న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకం, రాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, 9న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష బిల్వార్చన, రాత్రి స్వామివారి రథోత్సవం జరిపించనున్నారు. 10న మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవంతో ఉత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు.

### పూజల్లో పాల్గొనే భక్తులకు టికెట్లు

మహ శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు వసతి కల్పించనున్నారు. వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు టికెట్లను నిర్ణయించారు. 7న కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ. 516(ఇద్దరికి), మహాశివరాత్రి రోజున జరిగే అభిషేకానికి రూ 300, రాత్రి జరిగే శతరుద్రాభిషేకానికి రూ. 516(ఇద్దరికి), 9న జరిగే లక్ష బిల్వార్చనలో పాల్గొనే భక్తులు రూ. 516(ఇద్దరికి) చెల్లించాల్సి ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధం



- ఎలక్షన్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నం
- వేసవిలో నీటి సమస్య లేకుండా ప్రణాళిక
- బ్రహ్మాండంగా గుట్ట బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తం
- త్వరలోనే బస్వాపూర్ బాధితులకు పరిహారం
- నమస్తే తెలంగాణతో కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

ఇంటర్వ్యూ
Interview

యాదాద్రి భువనగిరి, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలక్షన్లకు సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ హన్మంతు కె. జెండగే స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. సోమవారం ఆయన నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించాం. బ్యాలెట్ ర్యాండమైజేషన్ పూర్తయ్యింది. అధికారులు, సిబ్బందికి శిక్షనణ పూర్తయ్యింది. ఓటరు నమోదు తుది ప్రచురణ జరిగింది. ఇంకా ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది. ఎన్నికల పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఏడు నియోజకవర్గాలు పరిధిలో పార్లమెంట్ ఉండటంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తాం. సమర్థంగా ఎలక్షన్లను నిర్వహిస్తాం.

### నీటి ఎద్దడికి ప్రణాళిక..

వేసవి కాలం సమీపిస్తుండటంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. జిల్లాలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. నీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ఏయే మండలాలు, గ్రామాల్లో సమస్య ఉంటుందో మండలాల వారీగా రిపోర్ట్ తీసుకున్నాం. అక్కడ సమస్యను ఎలా అధిగమించాలో కూడా ప్రత్యామ్నాయ చర్యలకు ప్లాన్ చేశాం. ఎట్టి పరిస్థితుల్లో నీటి సమస్య లేకుండా చూస్తాం.

### గుట్ట బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు..

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా, ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే అన్ని విభాగాలతో సమీక్ష చేస్తాం. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహిస్తాం.

### త్వరలోనే 'బస్వాపూర్' పరిష్కారం

భువనగిరి మండలంలో ఉన్న బస్వాపూర్ ప్రాజెక్టుకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నాను. ముంపు బాధితులకు పునరావాస కల్పించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది. రాగానే అర్హులందరికీ డబ్బులు చెల్లిస్తాం. ఆర్‌అండ్‌ఆర్‌లో భాగంగా ఇచ్చిన స్థలాల్లో నీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

# టేకులసోమారం పత్తి గోదాములో అగ్ని ప్రమాదం

వలిగొండ, మార్చి 4 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఎఫ్‌సీఐ గోదాములో నిల్వ ఉంచిన పత్తి బేళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండలంలోని టేకులసోమారం గ్రామ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. టేకులసోమారం గ్రామ పరిధిలోని గోడౌన్‌లో సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి బేళ్లకు మంటలు అంటుకున్నాయి. గుర్తించిన సిబ్బంది పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ప్రమాద స్థలానికి రామన్నపేట, భువనగిరి, మోత్కూరు, యాదగిరిగుట్ట, ఆలేరు అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే నాలుగు గోదాముల్లో నిల్వ ఉంచిన పత్తికి మంటలంటుకొని తీవ్ర నష్టం జరిగింది. జిల్లా అగ్నిమాపక అధికారి జయకృష్ణ, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేందర్ లాల్ పరిస్థితిని సమీక్షించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

# సగం మందికే ఉచిత కరెంట్

## ప్రజా పాలనలో గృహజ్యోతికి 2,09,131 దరఖాస్తులు

## ప్రభుత్వం మంజూరు చేసింది 1,18,350 కనెక్షన్లకే..

- జిల్లాలో తెల్లరేషన్ కార్డులు 2.16 లక్షలు
- వివిధ కారణాలతో వర్తించని పథకం
- సమస్య పరిష్కారానికి ప్రజాపాలన కేంద్రాలు

**ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకం అర్హులందరికీ అందడంలేదు. జిల్లాలో సగం ఇండ్లకే ఉచిత కరెంట్ మంజూరైంది. వీరంతా బిల్లులు చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ బిల్లులు జారీ చేస్తున్నది. గృహజ్యోతి పథకం కోసం ప్రజా పాలనలో 2,09,131 దరఖాస్తులు రాగా, ప్రభుత్వం మాత్రం 1,18,350 కనెక్షన్లకే మంజూరు ఇచ్చింది. వివిధ కారణాలతో ఫ్రీ కరెంట్ వర్తించ లేదు. ఇదిలా ఉండగా అర్హుల సమస్య పరిష్కారానికి సర్కారు ప్రజా పాలన కేంద్రాలను తీసుకొచ్చింది.**

– యాదాద్రి భువనగిరి, మార్చి 4 (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారంలోకి వచ్చాక ఆయా పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఇందు కోసం డిసెంబర్ 28వ తేదీన ప్రజా పాలన కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. జనవరి ఆరో తేదీ వరకు దరఖాస్తులను తీసుకుంది. మొత్తంగా 2,68,790 దరఖాస్తులు రాగా అదే నెల 17 వరకు వాటిని ఆన్‌లైన్ చేశారు.







### 1,18,350 కనెక్షన్లకే ఫ్రీ కరెంట్..

ఆరు గ్యారెంటీల్లో గృహ జ్యోతి పథకం ఒకటి. 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్‌ను వాడుకోవచ్చు. 200 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ అదనంగా వాడినా మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ఫ్రీ కరెంట్ కోసం 2,09,131మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. కానీ ప్రభుత్వం మాత్రం 1,18,350 కనెక్షన్లకే మంజూరు ఇచ్చింది. అంటే 90,781మందిని అనర్హులుగా తేల్చింది. జిల్లాలో ఇప్పటి వరకు 40వేల వరకు విద్యుత్ బిల్లులు జనరేట్ చేశారు. ఇందులో 93శాతం జీరో బిల్లులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాలో 2.16లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండటం గమనార్హం.

### వివిధ కారణాలు..

ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ వివిధ కారణాలతో మంజూరు చేయలేదని తెలిసింది. కొందరికి తెల్ల రేషన్ కార్డులు లేపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఇక ఆధార్ కార్డు నంబర్లు సరిగా ఎంటర్ చేయకపోవడం, కస్టమర్ ఐడీ సరిగా ఇవ్వకపోడం లాంటి తదితర కారణాలతో మంజూరు కాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. కొంత మందికి 200యూనిట్లు కంటే ఎక్కువ కరెంట్ వాడి ఉండవచ్చని పేర్కొంటున్నారు.

### ప్రజాపాలన కేంద్రాల ఏర్పాటు..

గృహ జ్యోతి పథకం అమలు మొదటి నెల కావడంతో కొన్ని చోట్ల లోపాలు ఉండవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. పెద్ద మొత్తంలో అనర్హులుగా తేలడంతో సమస్యల పరిష్కారానికి చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం జిల్లాలో ప్రజా పాలన కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తి చేసింది. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. భువనగిరి, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో రెండేసి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేయగా, మండలానికో సేవా కేంద్రం పెట్టారు. జీరో బిల్లులు రాని వారు సేవా కేంద్రాల్లో సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఏమైనా పొరపాటు ఉంటే వెంటనే ఆపరేటర్ ఎడిట్ ఆప్షన్‌లో క్లియర్ చేయనున్నారు.

### గృహ జ్యోతి వర్తించలేదని నిరసన

ఆలేరు రూరల్ : ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తులు చేసుకున్నా తమకు గృహ జ్యోతి పథకం వర్తించలేదని మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన పలువురు బాధితులు నిరసన చేపట్టారు. ఆలేరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సర్కారు కొంతమందికే పథకాలను అమలు చేస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నదని అన్నారు. ఈ నెల విద్యుత్ బిల్లు యథావిధిగా వచ్చిందని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడినా తాము ఏ పాపం చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలేరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కరెంట్ బిల్లులు చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

# యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి వస్త్రాలు

- సిద్ధం చేస్తున్న చేనేత కళాకారులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 4 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు భూదాన్ పోచంపల్లి నుంచి వస్త్రాలను అందించనున్నారు. స్థానిక పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి రెండు ఇక్కత్ పట్టు చీరెలు, స్వామివారికి పట్టు దోవతులు, శాలువాలు సమర్పించేందుకు సంబంధిత వస్త్రాలను పద్మశాలి మహాజన సంఘ భవనంలో మగ్గం ఏర్పాటు చేసి తయారు చేస్తున్నారు. మగ్గంపై ఫిబ్రవరి 29 నుంచి నేతను ప్రారంభించి పట్టు దోవతులు, శాలువాలు తయారు చేశారు. లక్ష్మీదేవి అమ్మవారి కోసం ఆఫ్ వైట్, మెరూన్ అంచు ఒక చీర, చిలకపచ్చ మెరూన్ అంచుతో ఫుల్ డిజైన్ ఇక్కత్ పట్టు చీరెలను నిమయనిష్టలతో చేనేత కళాకారులు మేకల రామకృష్ణ, పురుషోత్తం తయారు చేస్తున్నారు. ఈ నెల 9న పట్టు చీరెల తయారీ పూర్తికానున్నది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల కోసం ప్రతి సంవత్సరం మాదిరిగానే భూదాన్‌పోచంపల్లి మార్కండేశ్వర స్వామి దేవాలయం నుంచి ముత్యాల తలంబ్రాలు సమర్పణ చేయనున్నారు.

ఈ నెల 11న యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను అందజేసేందుకు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షులు బోగ నరసింహ, అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారత బాలరత్నం, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



లక్ష్మీ అమ్మవారి కోసం చీరె నేస్తున్న కార్మికుడు

# భూ ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ వద్ద డీవీఆర్ వెంచర్ బాధితుల ధర్నా

భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : తమ ప్లాట్లను కబ్జా చేసి తమను బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. వడపర్తి రెవెన్యూ గ్రామ పరిధిలోని డీవీఆర్ వెంచర్ బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడపర్తి రెవెన్యూ పరిధిలో 503, 507, 509, 510, 521, 522, 523, 524, 530, 532 సర్వే నంబర్లలో 14.20 ఎకరాల భూమిలో ప్లాట్లు చేసి హైదరాబాద్‌కు చెందిన డీవీఆర్ రియల్ ఎస్టేట్ కంపెనీ యజమాని వెంకటేశ్వర్లు తమకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అయితే.. బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామానికి చెందిన ఈదులకంటి దయాకర్ రెడ్డి తమ ప్లాట్లను దొంగ పట్టా చేయించుకున్నాడని, ఆ భూమికి రైతుబంధు కూడా పొందుతున్నాడని ఆరోపించారు. సోమవారం ప్లాట్ వద్దకు వెళ్లి చూస్తే హద్దు రాళ్లను కూల్చి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉన్నదని, దయాకర్‌రెడ్డి తన అనుచరులతో దాడులకు దిగుతున్నాడని తెలిపారు. ఈ విషయమై భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో, కలెక్టర్‌కు, డీసీపీకి ఫిర్యాదు చేశామన్నారు. దయాకర్ రెడ్డి, డీవీఆర్ వెంచర్ యజమాని వెంకటేశ్వర్‌రావుపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు వడపర్తి గ్రామస్తులు మద్దతుగా నిలిచారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న డీవీఆర్ వెంచర్ బాధితులు

## నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈఓ శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతిదినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 431 మంది గైర్హాజరు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 4 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జిల్లాలో సజావుగా సాగుతున్నాయి. సోమవారం ఫస్టియర్ మ్యా థ్స్–1, బోటనీ–1, పొలిటికల్ సైన్స్–1 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 6,880 మంది విద్యార్థులకు గాను 6,449 మంది హాజరు కాగా, 431 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ ఆఫీసర్ సి.రమణి తెలిపారు.



సూర్యాపేటలోని గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు

# మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- మినీ డీఎస్సీతో చేతులు దులుపుకొంటే ఊరుకోం.. మెగా డీఎస్సీ వేయాల్సిందే..
- రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం
- సూర్యాపేటలోని గ్రంథాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థుల నిరసన

బొడ్రాయిబజార్, మార్చి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. డీఎస్సీ మెగా డీఎస్సీ కాదని.. దగా డీఎస్సీ అని, ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం 20 వేల పోస్టులకు తగ్గకుండా మెగా డీఎస్సీ వేయాలని, లేకుంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు హెచ్చరించారు. ప్రభుత్వం వేసిన మినీ డీఎస్సీని వ్యతిరేకిస్తూ సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో మొత్తం 11,062 పోస్టులు ప్రకటించిందని, ఇందులో అధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఉన్నాయని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేవలం 2,629 మాత్రమే ఉండడం బాధ కలిగిస్తుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు సెకండరీ గ్రేడ్ పోస్టులకు అర్హత లేకపోవడం దారుణమన్నారు. గత నోటిఫికేషన్‌కు ప్రస్తుత నోటిపికేషన్‌కు ఎలాంటి పోస్టులు పెరుగలేదన్నారు. మార్చిలో పదవీ విరమణ చేస్తే ఖాళీ అయ్యేవాటిని కలిపి 24వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఖాళీలను గుర్తించి టెట్ నిర్వహించాలని, ఆ తరువాత 20 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు తగ్గకుండా మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై హైదరాబాద్‌లో జరుగుతున్న డీఎస్సీ ధర్నాకు తాము సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నిరుద్యోగులు శ్రీనివాస్, వెంకన్న, మహేశ్, సైదులు, శ్రవణ్, రమాదేవి, శ్రీదేవి, మాలతి, జానయ్య, హారిక, రాధిక, కవిత, లింగయ్య, నజీర్ పాల్గొన్నారు.

# సన్న, చిన్నకారు రైతులకు కట్టంగూర్ ఎఫ్‌పీఓ ఆదర్శం

- మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం

కట్టంగూర్, ఫిబ్రవరి 10 : కట్టంగూర్ ఎఫ్‌పీఓ ప్రపంచంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆదర్శమని మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ విభాగం డైరెక్టర్ క్వింటన్ ఆర్ టైలర్ అన్నారు. సోమవారం మండలంలోని అయిటిపాముల జీపీ పరిధిలో గల గంగాదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ విభాగానికి చెందిన అమెరికా శాస్త్రవేత్తల బృందం సభ్యులు సందర్శించారు. సంఘం నిర్వాహకులు నిమ్మ స్టోరేజీ యూనిట్, ప్రాసెసింగ్ యూనిట్, సోలార్ డయ్యర్స్ గురించి వారికి వివరించారు. సన్న, చిన్న కారు రైతులు సమస్యలను పరిష్కరించుకునేదుకు సంఘటితంగా ఎఫ్‌పీఓను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ఖరీం మరిడియా, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి సంగీత లక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, ఏడీఏ హుస్సేన్‌బాబు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్, ఏఓ శ్రీనివాస్, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఎఫ్‌పీఓలో నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం